IndiaFirst LIFE INSURANCE

**Publication: Andhra Jyothi** **Date: Monday, 18th January, 2016**

**Edition: Hyderabad**

# సరైన పాలసీ ఎంపిక చేసుకోవడం ఎలా?

**లైఫ్ లైన్**

ఆర్ఎం విశాఖ

**భిన్న** స్వభావాలతో కూడిన బీమా పాలసీలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. కొన్ని రాబడులకు హామీ ఇస్తుంటే మరికొన్ని డెట్, ఈక్విటీ మార్కెట్లలో కదలికలకు దీటుగా మార్కెట్ అనుసంధాన రాబడులు అందిస్తాయి. రెండో తరహా పాలసీల్లో రాబడులు మార్కెట్లు పురోగమనపథంలో ఉంటే ఎంత అధికంగా ఉంటాయో మార్కెట్లు పతనావస్థలో ఉంటే అంత కనిష్ఠంగా ఉండే ప్రమాదం కూడా ఉంది. బీమా పాలసీల దీర్ఘకాలిక స్వభావాన్ని పరిగణనలోకి తీసుకుంటే మీ నుంచి సేకరించిన నిధులను భిన్న స్వభావం గల సాధనాల్లో ఇన్వెస్ట్ చేయడం వల్ల అధిక ప్రయోజనం ఉంటుంది. మార్కెట్‌తో అనుసంధానమైన బీమా పాలసీలు కూడా సాధారణంగా సురక్షితంగానే ఉంటాయి. స్వభావరీత్యా దీర్ఘకాలిక పెట్టుబడి, భద్రత ప్రయోజనాలు అందిస్తున్నందువల్ల బీమా కంపెనీలు దీర్ఘకాలిక బాధ్యతల నిర్వహణకు అవసరమైన నిధులు చేతిలో ఉంచుకోవాల్సి ఉంటుంది. అందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవడం తప్పనిసరి. ఇలాంటి ఏర్పాట్లు చేయడం వల్ల బీమా పాలసీలు స్థిరమైన దీర్ఘకాలిక పెట్టుబడి సాధనంగా నిలుస్తాయి.

రిస్క్ రీత్యా పాలసీదారులను మూడు శ్రేణులుగా వర్గీకరించవచ్చు. తక్కువ రిస్క్ భరించగలవారు, మధ్యస్థమైన రిస్క్ భరించగలవారు, ఒక మోస్తరుగా అధిక రిస్క్ భరించగల వారు.

**తక్కువ రిస్క్:** ఈ శ్రేణిలోకి వచ్చే పాలసీదారులు తమ పెట్టుబడికి రక్షణ, గ్యారంటీ రాబడులు రెండింటినీ ఆశిస్తారు. ఇలాంటి వారికి ఎండోమెంట్ ప్లాన్లు, మనీబ్యాక్ ప్లాన్లు, డిఫర్డ్ పెన్షన్ ప్లాన్లు, గ్యారంటీడ్ రిటైర్మెంట్ ప్లాన్లు చక్కగా సరిపోతాయి.

రాబడులకు గ్యారంటీ ఇచ్చే బీమా ప్లాన్లు పాలసీదారుల పెట్టుబడికి భద్రత కల్పించడంతో పాటు రాబడులకు కూడా గ్యారంటీ ఇస్తాయి. ఈ ప్లాన్లలో సాధారణంగా ప్రతి ఏడాది చివరిలో పెట్టుబడిపై రాబడిని బీమా కంపెనీలు ప్రకటిస్తాయి. ఆ మొత్తాన్ని పాలసీదారుల బీమా ఖాతాలో జమ చేసి చివరిలో చెల్లిస్తారు.

**మధ్యస్థమైన రిస్క్:** ఈ శ్రేణి పాలసీలు పెట్టుబడికి రక్షణ ఇవ్వడంతో పాటు కార్పొరేట్ బాండ్లు, ప్రభుత్వ సెక్యూరిటీలు అందించే రాబడులు అందచేస్తాయి. డెట్, బ్యాలెన్స్‌డ్ ఫండ్లలో ఇన్వెస్ట్ చేసే యులిప్ పాలసీలు ఇందుకు చక్కని సాధనాలు. ఇవి పాలసీదారుల సొమ్మును డెట్ లేదా బ్యాలెన్స్‌డ్ ఈక్విటీ, డెట్ స్కీమ్‌లలో ఇన్వెస్ట్ చేస్తాయి. వీటిలోనే కొంత పరిమాణంలో రాబడి జమ కాగానే ఆ సొమ్మును ఈక్విటీ నుంచి డెట్‌కు బదిలీ చేసే యులిప్‌లు కూడా ఉన్నాయి.

**ఒక మోస్తరు రిస్క్:** మార్కెట్‌లో ఈక్విటీలకు దీటైన రాబడులు ఈ తరహా పాలసీలు అందిస్తాయి. ఈక్విటీ ఫండ్లలో అధిక మొత్తం ఇన్వెస్ట్ చేసే యులిప్ పాలసీలు ఇందుకు చక్కగా సరిపోతాయి.

ఈ పాలసీలు సాధారణంగా పాలసీదారులకు వారు పెట్టుబడి పెడుతున్న మొత్తంలో ఎంత ఈక్విటీలో ఇన్వెస్ట్ చేయాలి, ఎంత డెట్‌లో




ఇన్వెస్ట్ చేయాలి నిర్ణయించుకునే వెసులుబాటు కల్పిస్తాయి. ఎంత రిస్క్ అయినా భరించగల సామర్థ్యం ఉన్న వారైతే తాము ఇన్వెస్ట్ చేస్తున్న మొత్తంలో నూరు శాతం ఈక్విటీలో పెట్టే ఆప్షన్ కూడా ఎంచుకోవచ్చు.

> రాబడులకు గ్యారంటీ ఇచ్చే బీమా పథకాలు పాలసీదారుల పెట్టుబడికి భద్రత కల్పించడంతోపాటు రాబడులకు కూడా గ్యారంటీని ఇస్తాయి. ఈ పథకాల్లో సాధారణంగా ప్రతి ఏడాది చివరిలో పెట్టుబడిపై రాబడిని బీమా కంపెనీలు ప్రకటిస్తాయి.

బీమా పాలసీలు రక్షణ, పెట్టుబడి ప్రయోజనాలు రెండూ అందిస్తాయి గనుక ప్రీమియంపై అవి మోర్టాలిటీ, పాలసీ అడ్మినిస్ట్రేషన్ చార్జీలను వసూలు చేస్తాయి. ఈ స్వభావరీత్యా వాటిని ఇతర ఉత్పత్తులతో సరిపోల్చడానికి అవకాశం లేదు. దేనికి ఎంత వసూలు చేశారన్న రీతిలో ఇతర సాధనాలతో సరిపోల్చిచూడడం లేదా విడదీసి చూడడం వల్ల పాలసీదారునికి సరైన అవగాహన ఏర్పడే అవకాశం ఉండదు.

- బీమా పాలసీలు ప్రీమియం చెల్లింపు విధానాలు, కాలపరిమితి విషయంలో కూడా పాలసీదారునికి వెసులుబాటు కల్పిస్తాయి. పాలసీదారులు ఎవరికి అనుకూలమైన రీతిలో వారు నెలవారీ లేదా త్రైమాసికం లేదా అర్ధసంవత్సరం లేదా వార్షిక చెల్లింపు విధానంలో ప్రీమియం చెల్లించవచ్చు.
- కొన్ని పాలసీలకు పరిమిత కాలం పాటు మాత్రమే ప్రీమియం చెల్లించి అధిక కాలం పాటు బీమా రక్షణ పొందే వెసులుబాటు కూడా ఉంటుంది. ఉదాహరణకి ఏడు సంవత్సరాలు ప్రీమియం చెల్లించి 20 సంవత్సరాలకు బీమా రక్షణ పొందడాన్ని ఎంచుకోవచ్చు.
- మరికొన్ని పాలసీలకు ఏకమొత్తంలో ప్రీమియం చెల్లించి దీర్ఘకాల రక్షణ కూడా పొందవచ్చు.
- ఇంకా కొన్ని పాలసీలు నిర్దిష్ట కాలపరిమితిలో పాలసీదారుని ఖాతాలో జమ అయిన నిధి నుంచి కొంత మొత్తం ఉపసంహరించుకునే స్వేచ్ఛ కూడా కల్పిస్తున్నాయి.

ఉదాహరణకి మీ పిల్లల ఉన్నత విద్య కోసం 20 సంవత్సరాల కాలపరిమితిలో నిధి కూడబెట్టుకోవాలనుకున్నారు. కాని 10 సంవత్సరాలకి మించి మీరు ప్రీమియం చెల్లించాలనుకోవడంలేదు. అలాంటప్పుడు 10 సంవత్సరాల పరిమిత కాలం పాటు మాత్రమే ప్రీమియం చెల్లించి 20 సంవత్సరాల తర్వాత ఆ సొమ్ము పూర్తిగా అందుబాటులోకి వచ్చే పాలసీ ఎంపిక చేసుకోవచ్చు. అయితే పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉండకపోవచ్చు. ఆ 20 సంవత్సరాల కాలపరిమితిలో మధ్యలో మీకు కొంత సొమ్ము అవసరం కావచ్చు. అలాంటి సందర్భాల్లో పాలసీదారుని ఖాతాలో జమ అయిన కార్పస్ నుంచి కొంత మొత్తం ఉపసంహరించుకునే అవకాశం కల్పిస్తాయి.



గత కొద్ది వారాలుగా పాలసీదారుల అవసరాలు గుర్తించడం, భవిష్యత్తులో ఎదురయ్యే అవసరాలకు ప్రణాళికలు రూపొందించుకోవడం, ఆర్థిక ప్రణాళికల నిర్వహణలో బీమా పాలసీల ప్రాధాన్యత, పాలసీదారులు రిస్క్‌ను మదింపు చేసుకోవడం వంటి అంశాలు విస్తృతంగా చర్చించాను. ఈ వ్యాసంలో పాలసీల స్వభావాలు కూడా తెలియచేశాను. ఇవన్నీ పాఠకులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని భావిస్తాను. ఇప్పుడు పాఠకుల నుంచి స్పందన ఆశిస్తున్నాను. ఎవరైనా ఎలాంటి అనుమానాల నివృత్తికైనా లేదా వివరాలకైనా rm.vishakha@indiafirstlife.com కి రాయవచ్చు.

- రచయిత్రి, ఇండియా ఫస్ట్‌లైఫ్ ఇన్సూరెన్స్ ఎండీ, సిఈఓ

A Joint Venture of
Bank of Baroda Legal & General Andhra Bank